క్లుప్తంగా

డీఆర్‌డీఓకి వినతి



నారాయణపేట: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న సీనియర్ మేటీలను ఫీల్డ్ అసిస్టెంట్లుగా గుర్తించాలని కోరుతూ రైతు సంఘాల ఆధ్వర్యంలో బుధవారం డీఆర్‌డీఓ మొగులప్పకు వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు.. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, అధ్యక్షుడు బాలప్ప, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాలుగా ఎఫ్‌ఏలు లేని గ్రామాలలో సీనియర్ మేటిలే కూలీలకు ఉపాధి కల్పిస్తున్నారన్నారు. సీనియర్ మేటీలని క్షేత్ర సహాయకులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ తమ సమస్యను కలెక్టర్ ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీనియర్ అధ్యక్షులు విజయ్ కుమార్, నాయకులు, లక్ష్మయ్య, నాగరాజు, అప్సర్, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

మట్టిరోడ్లు నిర్మించుకోవాలి



మాగనూర్: గ్రామాల్లో ఉపాధిహామీ ద్వారా మట్టిరోడ్లు నిర్మించుకోవాలని ఇన్‌చార్జి ఏపీఓ హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని నేరడగందొడ్డిలో ఉపాధిహామీ పనులపై నిర్వహించిన గ్రామ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు.. పాటుకాల్వలు, మట్టిరోడ్లు, ఫీల్డ్ చానెల్ తదితర పనులపై గ్రామస్తులకు వివరించారు. అనంతరం ఈ విషయాలపై సభలో తీర్మానం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ప్రాణాలు కాపాడిన పోలీసులు

నారాయణపేట: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బండగొండ గ్రామానికి చెందిన అషుల శ్రీకాంత్‌రెడ్డి కుటుంబ కలహాలతో తన తండ్రి మందలించారని జీవితంపై విరక్తి చెంది తాను చనిపోతున్నానని మంగళవారం రాత్రి 10గంటల ప్రాంతంలో ఇంట్లో చెప్పి వెళ్లిపోయాడు. ఎంతసేపటికి కొడుకు రాకపోయేసరికి ఊర్లో అంత వెతకి చివరికి డయల్ 100కి సమాచారం ఇవ్వగా వెంటనే స్పందించి రూరల్ ఎస్సై రాముడు ఆదేశాల మేరకు కానిస్టేబుల్స్ ఆనందం, ప్రదీప్‌కుమార్ వెంటనే గ్రామానికి చేరుకుని అతడి సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా శ్మశాన వాటికలో గుర్తించి పట్టుకొని అతడి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ మేరకు.. గ్రామస్తులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

వర్కూర్‌లో తాగునీటి ఎద్దడి



మాగనూర్: మండలంలోని వర్కూర్‌లో నాలుగు రోజులుగా తాగునీటి ఎద్దడి ఏర్పడిందని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ విషయంపై గ్రామ పంచాయతీ కార్యదర్శి నర్సింహా రెడ్డిని వివరణ అడగగా.. గ్రామానికి వచ్చేమిషన్ భగీరథ నీరు గ్రామ సమీపంలోని పెద్దవాగు వద్ద పైపులైన్ మరమ్మతుకు గురైనట్లు తెలిపారు. దీంతో నీటి ఎద్దడి ఏర్పడిందని రెండు రోజుల్లో నీటి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

మాగనూర్: వరిపంట చేతికొచ్చే సమయంలో మబ్బులు కమ్ముకొని ఒక్కసారిగా అకాల వర్షం కురవడంతో వరిపంట పూర్తిగా నేలకొరిగింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలోని మాగనూర్, ఓబ్లాపూర్, అమ్మపల్లి, మందిపల్లి, వర్కూర్, నేరడగం, ఉజ్జెల్లి తదితర గ్రామాల్లో ఐదునెలల క్రితం వరి పంటలను సాగు చేశారు. ఇప్పటికే కోతలు మొదలైన నేపథ్యంలో ఇలా ఆకస్మతుగా మంగళవారం రాత్రి గాలితో కూడిన వర్షం భారీగా కురిసింది. దీంతో పదుల సంఖ్యల ఎకరాలల్లో వరి పంట నేల కూలిందని రైతులు వాపోతున్నారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలని కోరుతున్నారు.



ఎల్‌ఆర్‌ఎస్.. వేగవంతం

- చకచకా దరఖాస్తుల పరిశీలన
- మండలంలో మొత్తం దరఖాస్తులు 3980
- పరిష్కరించినవి 2380



మరికల్‌లో వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్ (ఫైల్)

మరికల్: మండలంలో పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీచేయడంతో అధికారులు ఆ దిశగా దరఖాస్తుల పరిశీలన పనులు వేగవంతం చేశారు. మొదట్లో వేగం తగ్గిన ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు ప్రక్రియ ఇక నుంచి పూంజుకోనుంది. గత ప్రభుత్వంలో జాప్యం కారణంగా ప్రస్తుత ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించింది. టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. అయితే ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాలేదు. దీంతో మూడు శాఖల అధికారులను కూడా దరఖాస్తుల పరిశీలనలో భాగం చేసింది. వీరితో కలిసి పరిశీలన చేయడంతో దరఖాస్తుల ప్రక్రియలో వేగం పెరిగింది. ఇప్పటివరకు మండలంలో మొత్తం 3,980 పెండింగ్ దరఖాస్తులు ఉండగా వాటిలో 2,380 దరఖాస్తులను పరిష్కరించారు. ఇక 1600 పెండింగ్‌లో ఉన్నాయి.

స్థానికంగా ఉండటం లేదు..

అధికారులు దరఖాస్తుల పరిశీలనకు వెళ్లిన సమయంలో ప్లాట్ ఎక్కడుందో యజమానులు చూపించాలి. అయితే వారు స్థానికంగా లేకపోవడంతో సాంకేతిక సమస్యలతో దరఖాస్తుల పరిశీలనలో జాప్యం జరుగుతోంది. హైదరాబాద్, ముంబాయి, బెంగళూర్ తదితర ప్రాంతాల్లో ఉన్నవారు రావడానికి సమయం పడుతుంది. ఫోన్‌చేసిన స్పందించడం లేదని అధికారులు చెబుతున్నారు. మరోవైపు వారి ప్లాట్లలో ముళ్లపొదలు పెరగడంతో గుర్తించడం కష్టంగా మారిందంటున్నారు.

కలెక్టర్ పర్యటనతో పెరిగిన వేగం..

వారం రోజుల క్రితం మరికల్ మండలంలో పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిశీలించిన కలెక్టర్ సిక్తా పట్నాయక్ క్షేత్రస్థాయిలో వెళ్లిప్లాట్ల యాజమానులతో మాట్లాడారు.. త్వరగా ఒక దరఖాస్తు కూడా పెండింగ్‌లో లేకుండా దరఖాస్తుల ప్రక్రియను వేగవంతం చేయాలని మండల శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో వేగం పూంజుకుంది. ప్లాట్ల రెగ్యులరైజేషన్ కోసం యాప్‌లో ఉన్న ఎంపికలను పరిశీలించి పూర్తిచేయాలని అధికారులకు సూచించడంతో ఆయా శాఖల అధికారులు ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను తీసుకెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేశారు.

గాంధీ ఆశయ సాధనకు పాటుపడుదాం..



మాట్లాడుతున్న డా. విజయకుమార్

ఊట్కూర్: జాతీపిత మహాత్మా గాంధీ ఆశయ సాధనకు పాటుపడుదామని రిటైర్డ్ డీఈఓ డా. విజయకుమార్ అన్నారు. వంద రోజుల్లో వెయ్యి కిలో మీటర్ల బాపూజీ సత్యశోధక్ పాదయాత్రలో భాగంగా బుధవారం 22వ రోజు చిన్నపోర్ల గ్రామానికి చేరుకున్నారు. ఈ మేరకు.. ఆయనకు విద్యార్థులు, యువకులు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి, అహింసా మార్గలే జాతికి, దేశానికి శరణ్యమని అన్నారు. గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని, గ్రామాలు అభివృద్ధి పడితే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యార్థులు, యువకులు చేడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చిన్నప్పటి నుంచే దేశభక్తి, దైవభక్తి పెంచుకోవాలని కోరారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంఓ రాంచంద్రాచారి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యగ్నేశ్వర్‌రెడ్డి, శ్యాంసుందర్, గ్రామస్తులు ప్రశాంత్‌కుమార్, హుసేన్, చెన్నకేశవులు, నాసీర్, అంజప్ప తదితరులు పాల్గొన్నారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



తహసీల్దార్ సతీస్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న విద్యార్థులు

మక్తల్: ప్రభుత్వం తక్షణమే విద్యార్థులకు ఇవ్వాల్సిన పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్‌లు విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్ అన్నారు. బుధవారం పట్టణంలోని తహసీల్దార్ ఎదుట పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తుందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి పదినెలలు కావస్తున్నా ఉన్నత విద్య అందించడంలో విఫలం చెందుతున్నారని విమర్శించారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేసి 16లక్షల మంది విద్యార్థులకు చేయూతనివ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అజయ్, చెన్నయ్య, విజయ్, గణేష్, రాకేష్, రాజశేఖర్, గోవిందు, సంతోష్, నరేందర్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రహ్మతుద్దీన్

మాగనూర్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ రహ్మతుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని కొల్పూర్‌లో ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించి, నాణ్యత పాటించాలని వంట ఏజెన్సీకి సూచించారు. తరగతి గదులో విద్యార్థులతో ముచ్చటించి వారి సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఇప్పటి నుంచే తమ లక్ష్యాన్ని ఏర్పరుచుకుని దానిని సాధించేందుకు శ్రమించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని నర్సరీ, పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి



ఊట్కూర్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఊట్కూర్: ప్రభుత్వం సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్రామారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధిక వర్షాలతో పత్తి పంట దెబ్బతిందని, రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పండించిన పత్తిపంటను ప్రైవేట్‌లో అమ్మడంతో క్వింటాల్‌కు రూ. 2వేల నుంచి 3వేల వరకు నష్టపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం సీసీఐ ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి పత్తి రైతులను ఆదుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ రవికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గోవింద్‌రాజ్, సీఐటీయూ మండల కన్వీనర్ నారాయణ, రైతులు వెంకటయ్య, రాజప్ప, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: ప్రభుత్వం సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతూ.. మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. పత్తి మిల్లుల వారు మద్దతు ధర కన్న తక్కువ రేటుకు కొనుగోలు చేస్తున్నారని, దీంతో పత్తి రైతులు నష్ట పోతున్నారన్నారు. పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని వారు కోరారు.

మరికల్: మండల సమీపంలో ఉన్న గుడిగండ్ల, లింగంపల్లి జిన్నింగ్ మిల్లుల వద్ద పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు శ్రీనివాస్, నర్సింహులు, రాములు, కమల్ అన్నారు. బుధవారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం త్వరగా సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో మార్కెట్‌లో వ్యాపారులు నిలువు దొపిడికి పాల్పడుతున్నారని ఆరోపించారు. పత్తి రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు నిర్లక్ష్యం చేయకుండా పత్తి సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.

మై భారత్ డైరీ ఆవిష్కరణ



మరికల్: మండలంలోని వికాస వేదిక ఆధ్వర్యంలో బుధవారం మై భారత్ డైరీని ఆవిష్కరించారు. స్థానిక మణికంఠ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మై భారత్ డైరీ ఆవిష్కరించారు. అనంతరం నెహ్రూ యువ కేంద్రం జిల్లా కో -ఆర్డినేటర్ అనిల్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. మై భారత్ ద్వారా యువతి, యువకుల కేరీర్ పరంగా అవకాశాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఒకరితో ఒకరికి నెట్‌వర్కింగ్, నైపుణ్యాలను అభివృద్ధి చేస్తూ వికసిత్ భారత్ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వికాస వేదిక అధ్యక్షుడు ఆంజనేయులు, హరీష్, శ్రీకాంత్‌రెడ్డి, మహేష్, రఘుపతిరెడ్డి, రాఘవేందర్, శేఖర్, కమల్ పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి

ఊట్కూర్/నర్వ: జర్నలిస్టుల సమస్యలకోసం నిరంతరం పోరాడేది టీయూడబ్ల్యూజే అని, ఈ నెల 27న జిల్లా కేంద్రంలో నిర్వహించే మహాసభను విజయవంతం చేద్దామని జిల్లా కన్వీనర్ నారాయణరెడ్డి కోరారు. బుధవారం ఊట్కూర్, నర్వ మండల జర్నలిస్టుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు రఘు, మధు, శ్రీనివాస్, ప్రతాప్‌రెడ్డి, మంజూర్ ఆహ్మద్, నర్వ మండల నాయకులు ఆంజనేయులు, సుదర్శన్‌గౌడ్, శంకర్ ఉన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు



ధన్వాడ: మండలంలోని మంత్రోనిపల్లిలో బుధవారం సభ్యత్వ నమోదును బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య ప్రారంభించారు. ఈ మేరకు.. ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలను గ్రామస్తులకు వివరించారు. కేంద్రం ప్రవేశపెట్టిన ప్రతి పథకం లబ్ధిదారులకు అందేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రవికుమార్, ఆంజనేయులు, వెంకటేష్, సహదేవ్, తిరుపతి, బాలరాజ్, ప్రశాంత్, నరేష్, గోపాల్, తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

మక్తల్: మండలంలోని గుడిగండ్ల వద్ద లక్ష్మిదుర్గ జిన్నింగ్‌మిల్‌లో బుధవారం పత్తి కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కార్యదర్శి చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ మేరకు.. పత్తి క్వింటాల్‌కు రూ. 7, 521 ధర ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. తేమ శాతం 8శాతం నుంచి 12ఉండేలా రైతులు చూసుకోవాలని కోరారు. నియోజకవర్గంలో పత్తి కొనుగోలు కేంద్రం గుడిగండ్ల వద్ద ప్రారంభించినట్లు తెలిపారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం కేటాయించిన మద్దతు ధరను పొందాలని కోరారు. కార్యక్రమంలో సీసీ అధికారి రవి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను అందిస్తున్న కడా అధికారి వెంకట్‌రెడ్డి

మద్దూరు: మండలంలోని లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదిముబారక్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారటీ (కడా) అధికారి వెంకట్ రెడ్డి స్థానిక నాయకులతో కలిసి ఆయా గ్రామాలకు వెళ్లి బుధవారం పంపిణీ చేశారు. మద్దూరులో 15, పల్లెర్లలో 20, రెనివట్లలో 18, జాధరామ్‌పల్లిలో 10, దోరేపల్లిలో 23మంది లబ్ధిదారులకు ఈ చెక్కులను అందజేశారు. అలాగే వీటితోపాటు రూ. 10.23 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను దాదాపు 20మంది లబ్ధిదారులకు అందజేశారు. మండలానికి వచ్చిన 135 చెక్కులో మిగిలిన చెక్కులను తహసీల్దార్ కార్యాలయంలో అందజేయనున్నట్లు తహసీల్దార్ మహేష్‌గౌడ్ పేర్కొన్నారు. అనంతరం ఇటీవలే మృతిచెందిన కాంగ్రెస్ నాయకుడు సతీష్‌కుమార్ తండ్రి మాజీ మండలాధ్యక్షుడు కల్లాపు శివరాజ్ కుటుంబాన్ని కడా అధికారి స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ, ఏఎంసీ చైర్మన్ భీములు, మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు సంజీవ్, బాబుస్వామి, లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత



లబ్ధిదారుడికి చెక్కుఅందజేస్తున్న మేనేజర్ నవీన్‌కుమార్

మద్దూరు: ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన కింద బీమా చేయించుకున్న వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందగా ఆ కుటుంబానికి ఎస్‌బీఐ మేనేజర్ నవీన్‌కుమార్ అందజేశారు. మోమినాపూర్‌లోని ఎస్‌బీఐ సీఎస్‌సీ సెంటర్‌లో దేవరపస్లవాడ్‌కు చెందిన మాన్పడి తిరుపతి పీఎంజెజెబీవైలో బీమా తీసుకున్నాడు. ఈ క్రమంలో అనారోగ్యంతో ఇటీవలే తిరుపతి మృతిచెందడంతో నామిని అయిన మాన్పడి కృష్ణకు రూ. 2లక్షల చెక్కును అందజేసినట్లు ఎస్‌బీఐ మేనేజర్ తెలిపారు. ఏడాది రూ.436 పాలసీ తీసుకుంటే సాధరణంగా మరణిస్తే రూ. 2లక్షలు, అలాగే ఏడాది ఈ బీమాలో రూ. 20 చెల్లిస్తే ఆక్సిడెంటల్‌గా మరణిస్తే రూ. 2లక్షలు, రూపే ఏటీఎం కార్డ్ ఉండి లాస్ట్ 45రోజుల్లో లావాదేవిలు జరిపి ఉండి ఆక్సిడెంటల్‌గా మరణిస్తే రూ.2లక్షల ఒకే వ్యక్తి రూ. 6లక్షల వరకు బీమా పొందవచ్చని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఫీల్డ్ అధికారి నరేందర్‌నాయక్, సీఎస్‌సీ సెంటర్ నిర్వహకుడు వెంకటేష్, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

మూఢనమ్మకాలపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మద్దూరు: గంజాయి, డ్రగ్స్, మూఢనమ్మకాలపై ఎస్‌ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, విజ్ఞానదర్శిని ఆధ్వర్యంలో స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ మేరకు.. ముఖ్య అతిథిగా స్థానిక ఎస్ఐ రాంలాల్ హాజరై దేశభవిష్యత్ యువత చేతిలో ఉందన్నారు. గంజాయి, డ్రగ్స్ లాంటి మాదక ద్రవ్యాల వినియోగంతో యువత శక్తి పెడదొవ పడుతుందన్నారు. నేటి కాలంలో చాలామంది యువత, సినీ ప్రముఖులు, వ్యాపారవేత్తలు వీటి బారిన పడుతున్న సంఘటనలు చూస్తున్నామన్నారు. అలాగే మూఢనమ్మకాలతో చాలామంది ఆర్థికంగా చితికి పోతున్నారని గుర్తుచేశారు. మూఢనమ్మకాలపై విజ్ఞాన దర్శిని వారు ప్రదర్శనలు ఇచ్చారు. ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మోహన్, ప్రిన్సిపాల్ రాములు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహ్మమద్ అలీ, నాయకులు నర్సప్ప, ఎల్లప్ప, సంజీవ్ పాల్గొన్నారు.

ఎస్‌ఏ-1 పరీక్షలను పర్యవేక్షించిన ఎంఈఓ



పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ

దామరగిద్ద: ప్రాథమిక ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న ఎస్‌ఏ-1 పరీక్షల నిర్వహణను బుధవారం ఎంఈఓ కృష్ణారెడ్డి ఆకస్మికంగా పర్యవేక్షించారు. మండలంలోని బాపన్‌పల్లి, తాటిమోనిగడ్డ ప్రాథమిక పాఠశాలలో పరీక్ష హాల్‌ను పర్యవేక్షించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరు కాకుండా చూడాలన్నారు. పరీక్షల నిర్వహణతో విద్యార్థుల సమార్థ్యాలు గుర్తించి వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను బోధించాలన్నారు. ఆయనతోపాటు సీఆర్పీ హుస్సెనప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



కృష్ణాలో విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ నిజాముద్దీన్

కృష్ణా: మండలంలోని ముడుమాల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అరవింద్, తరుణ్ ఇటీవల నిర్వహించిన నియోజకవర్గ సైక్లింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఎంఈఓ నిజాముద్దీన్ తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. వీరు వచ్చేనెల 4నుంచి 6వరకు జనగామ జిల్లా కేంద్రంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ మీనాకుమారి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మక్తల్: రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు మండలంలోని మాద్వార్ గ్రామానికి చెందిన మేఘన ఎంపికైనట్లు విశ్రాంత పీఈటీ గోపాలం తెలిపారు. ఈ మేరకు.. ఎస్ఐ భాగ్యలక్ష్మి గోపాలంను శాలువాతో సన్మానం చేశారు. వచ్చేనెల 4నుంచి 6వరకు జనగామ జిల్లా కేంద్రంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు.. ఈ మేరకు.. విద్యార్థినిని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

మున్నూరు కాపు సంక్షేమానికి కృషిచేద్దాం



బండి శివరాంరెడ్డి, సత్యరఘుపాల్‌రెడ్డిలను సన్మానిస్తున్న నాయకులు

నారాయణపేట: జిల్లాలోని మున్నూరు కాపు సంక్షేమానికి కృషి చేద్దామంటూ నూతన జిల్లా కన్వీనర్ బండి శివరాంరెడ్డి, కో-కన్వీనర్ సూతారి రఘుపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని కోటకొండ గ్రామానికి చెందిన మున్నూరుకాపు గౌరవ అధ్యక్షుడు వేపూర్ రాములు, వేపూర్ నర్సిరెడ్డి, పద్మారెడ్డి, శీలం లక్ష్మిరెడ్డి వారిని పూలమాలతో సన్మానించారు. ఈ మేరకు.. వారు మాట్లాడారు.. మున్నురు కాపులు అన్నిరంగాల్లో రాణించాలని, అందుకు తమవంతు సహాయసహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు మోహన్, వెంకటేష్, మల్లేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

మక్తల్: మండలంలోని సంగంబండ రిజర్వాయర్‌లో చేపలు పట్టేందుకు మత్స్యకారులకు అవకాశం కల్పించాలని ముదిరాజ్‌సంఘం ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ.. ముదిరాజ్‌ల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో నాయకులు కోళ్ల వెంకటేష్, శేఖర్, అంజయ్యాచారి, పృధ్వీరాజ్, కట్ట వెంకటేష్, కిష్టప్ప, నాగేందర్, లక్ష్మణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

రంగులు అద్దడంపై శిక్షణ

అమరచింత: అంగన్‌వాడీ కేంద్రంలో చదువుకుంటున్న చిన్నారులకు రంగులను స్ట్రాతో ఊదడం ద్వారా ఎలాంటి చిత్రాలు ఏర్పడతాయో అన్న విషయాలపై అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అవగాహన కల్పించారు. ఈమేరకు అంగన్‌వాడీ టీచర్ రాధిక మాట్లాడుతూ చిన్నారులకు ఆటపాటలతోపాటు ఇలాంటి రంగులను కాగితాల్లో వేసి వాటిని స్ట్రాతో నోటి ద్వారా ఊదమని చెప్పామన్నారు. దీంతో చిన్నారులు హుషారుతో పేపర్ మీద రంగులు అద్దారని తెలిపారు. చిన్నప్పటి నుంచి చిత్రలేఖనం , వంటి కార్యక్రమాలు వారిలో సృజనాత్మకతను పెంచుతాయని వివరించారు.